అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 314 | వరంగల్ | సోమవారం, 21 సెప్టెంబర్ 2026 | పేజీలు: 07

డబ్బు కోసం రాజకీయాల్లోకి రాలేదు

వైద్యం, ప్రజా సేవలో సంతృప్తి

- విద్యే బీసీల ఎదుగుదలకు ప్రధాన ఆయుధం
- కుల వివక్షే కసిగా మారింది
- వైద్యుడిగా ఎదిగినా.. రాజకీయాలపై మొదటి నుంచే గురి
- ఈటలే నా రాజకీయ గురువు.. ఆయన వెంటే నా ప్రయాణం
- పరకాలతోనే నా బంధం
- బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్‌రావు
- తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్



బీసీలు, ఎస్సీలు, ఎస్టీ సామాజిక వర్గాలు ఉన్నతంగా ఎదగాలంటే విద్య తప్ప మరో మార్గం లేదని, ముందుగా సామాజికంగా జ్ఞానోదయం రావాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్‌రావు అన్నారు. హక్కుల కోసం బీసీలు ఉద్యమించాలని, అదే సమయంలో అగ్రవర్ణాలను దూరం చేయకుండా తమ సమస్యలను వివరించి వారిని కూడా భాగస్వాములను చేసుకుంటేనే సామాజిక మార్పు సాధ్యమవుతుందని చెప్పారు. తనకు విద్య వృత్తి ద్వారానే చాలా గుర్తింపు లభించింది అని, ఇప్పుడు ప్రజా సేవ చేసే అవకాశం వస్తే సంతోషిస్తాను అని అన్నారు. డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో తన బాల్యం, చదువు, వైద్య ప్రస్థానం, ఎంబీబీఎస్‌లో ఎదురైన కుల వివక్ష, వైద్య రంగంలో వచ్చిన మార్పులు, గార్డియన్ ఆస్పత్రి నిర్మాణం, ఐఎంఏలో తన ప్రయాణం, బీసీ సామాజిక చైతన్యం, రాజకీయ రంగ ప్రవేశం, ఈటల రాజేందర్ తో తన అనుబంధం, పరకాల నియోజక వర్గంతో తనకు ఉన్న బంధం తదితర అంశాలను ఆయన పంచుకున్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వైద్యుడిగా ఎదిగి, వైద్య సంస్థను నిర్మించి, ఇప్పుడు రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేయాలని సాగుతున్న ఆయన ప్రయాణం ఆసక్తికరంగా సాగింది. *-అక్షరశక్తి, ప్రధాన ప్రతినిధి*

SPECIAL PAGE

మూడు బడులకు.. కొత్త భవనాలెప్పుడు?



- శిథిల భవనాలు.. అద్దె గదుల్లో తరగతులు
- ఒకే గదిలో 116 మంది విద్యార్థులకు బోధన
- 28 ఏళ్లుగా సొంత భవనం లేక అవస్థలు
- ప్రజావాణిలో కలెక్టర్‌కు టీపీజేఏసీ, తల్లిదండ్రుల వినతి

5



నిర్మాణం మధ్యలోనే నిలిచిన MPPS హనుమంతునిగూడెం



పూర్తిగా శిథిలావస్థలో ఉన్న MPPS పత్తిపాక



భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ పనులు వేగవంతం చేయాలి

- 2026–27లో భూసేకరణకు రూ.6 వేల కోట్లు
- ఇప్పటికే రూ.2,550 కోట్లు విడుదల..
- అవార్డులు జారీ చేసిన భూములకు తొలుత పరిహారం
- కలెక్టర్లతో మంత్రులు, సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం–పునరావాస పునరుద్ధరణ (ఆర్‌అండ్‌ఆర్) పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అంశాలపై సోమవారం రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హనుమకొండ నుంచి జిల్లా కలెక్టర్ చాహత్‌బాజ్‌పాయి పాల్గొన్నారు. *- అక్షరశక్తి, హనుమకొండ*

4



మద్యం సేవించి వాహనం నడపవద్దు

ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ

అక్షరశక్తి, హనుమకొండ: మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉన్నందున వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ సూచించారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించడంలో భాగంగా హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన సుమారు 150 మంది వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, ప్రాణనష్టం, చట్టపరమైన పరిణామాలపై వారికి అవగాహన కల్పించారు. మద్యం సేవించిన అనంతరం వాహనం నడపకుండా ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఏసీపీ సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల డ్రైవర్‌తో పాటు ఇతర వాహనదారులు, ప్రయాణికులు, పాదచారుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. మైనర్లను వాహనాలు నడిపేందుకు అనుమతించవద్దని, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. "మద్యం సేవించి వాహనం నడపవద్దు -సురక్షితంగా ప్రయాణించండి, ప్రాణాలను కాపాడుకోండి" అని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ నవీన్ కుమార్, ఎస్ఐ వేణుగోపాల్ రెడ్డి, మహిళా కానిస్టేబుల్ అరుణ పాల్గొన్నారు.

ఎర్రగట్టు గుట్ట గణనాథుడికి ఇనగాల పూజలు



అక్షరశక్తి,హసన్ పర్తి: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి డివిజన్ ఎర్రగట్టు గుట్ట సమీపంలోని కిట్స్ కాలేజ్ వద్ద కిట్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు ప్రసాదం అందజేశారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిర్ర రాము గౌడ్, దేవరకొండ అనిల్, వీసం సురేందర్ రెడ్డి, గరిగే రాజు, డబ్బ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



అక్షరశక్తి, పరకాల: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించి గౌరవించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వరంగల్‌లో నిర్మించతలపెట్టిన విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ మెండు రవీందర్, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు బాసని దయాకర్, శ్రీనివాస్ చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షుడు దార్న వేణుగోపాల్, మార్కండేయ చిట్స్ అధ్యక్షుడు రాచర్ల అశోక్, ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడు డాక్టర్ మంత్రి కాశయ్య, దుంపేటి నాగరాజు, స్థానిక కౌన్సిలర్ పోరండ్ల మౌనిక వేణు, మాజీ కౌన్సిలర్ చిదురాల దేవేందర్, దార్న కుమారస్వామి, తౌటమ్ మధు, భాస్కర్, సామంతుల రాజేందర్, ఆడెపు కుమారస్వామి, దాసరి రమేష్, మంతెన సంతోష్, పల్నాటి రాజేందర్, సతీష్ పాల్గొన్నారు.

కొత్తవాడ లో అన్నదాన కార్యక్రమం



అక్షరశక్తి, వరంగల్: కొత్తవాడ మార్కండేయ దేవాలయం వీధిలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యములో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు పూజారులు గెంట్యాల నాగరాజు మరియు కాలనీ వాసులు కమిటీ సభ్యులు ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు కమిటీ సభ్యులు అన్నదాన దాతలు సాయికృష్ణ,వంశీకృష్ణ,సాయాశ్వర్,సందీప్,తేజ,అఫ్సర్,శ్రీనివాస్, సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడిని చంపిన అన్న అరెస్ట్

- **డబ్బుల విషయంలో తరచూ గొడవలు..**
- **కక్షతో దారుణ హత్య**
- **గీసుగొండలో 24 గంటల్లో కేసు ఛేదన..**
- **కత్తి, రక్తపు మరకలున్న దుస్తులు స్వాధీనం**



అక్షరశక్తి, గీసుగొండ, సెప్టెంబర్ 21 : డబ్బుల విషయంలో తమ్ముడితో తరచూ గొడవపడుతున్న అన్న.. కక్ష పెంచుకుని అతడిని కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన వరంగల్ జిల్లా గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గరీబ్‌నగర్‌లో చోటుచేసుకుంది. కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించి నిందితుడైన మృతుడి అన్నను అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గరీబ్‌నగర్‌లోని ఓ అద్దె ఇంట్లో ఈ నెల 19న రాత్రి సుమారు 9.30 గంటలకు ఎలుబాక ప్రసాద్ (31) కత్తిపోట్లకు గురై మృతి చెందాడు. ఛాతి, వీపు, భుజం ప్రాంతాల్లో తీవ్ర గాయాలు గుర్తించారు. మృతుడి తల్లి ఎలుబాక సుజాత ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో మృతుడి అన్న ఎలుబాక ప్రవీణ్ (33) నిందితుడిగా తేలినట్లు పోలీసులు తెలిపారు.

డబ్బుల విషయంలో గొడవలు..

పోలీసుల వివరాల ప్రకారం.. ప్రవీణ్ తరచూ తన తల్లిని డబ్బులు అడిగేవాడు. ఈ విషయమై ప్రసాద్ అతడిని దూషించడంతో ఇద్దరి మధ్య గతంలో పలుమార్లు గొడవలు జరిగాయి. దీంతో ప్రసాద్‌పై ప్రవీణ్ కక్ష పెంచుకున్నాడని పోలీసులు తెలిపారు. తల్లి సంపాదించే డబ్బు తనకే దక్కాలనే ఉద్దేశంతో తమ్ముడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలో ఈ నెల 19న రాత్రి తాను స్వయంగా తయారు చేసుకున్న కత్తిని వెంట తీసుకుని గరీబ్‌నగర్‌లోని తల్లి, తమ్ముడు నివసించే ఇంటికి ప్రవీణ్ వెళ్లాడు. ఆ సమయంలో తల్లి నైట్ డ్యూటీకి వెళ్లడంతో ప్రసాద్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. కావాలనే ప్రసాద్‌తో గొడవకు దిగిన ప్రవీణ్.. వెంట తెచ్చుకున్న కత్తితో అతడి వీపు, ఛాతి, భుజంపై పలుమార్లు పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో ప్రసాద్ అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. దాడి సమయంలో జరిగిన పెనుగులాటలో ప్రవీణ్ ఎడమ బొటనవేలికి కూడా గాయమైనట్లు పోలీసులు తెలిపారు.

తల్లిని బెదిరించిన నిందితుడు

హత్య అనంతరం ప్రవీణ్ తన కీర్తినగర్ నివాసానికి వెళ్లి భార్యకు విషయం చెప్పిన అనంతరం తిరిగి తల్లి వద్దకు వచ్చాడు. అప్పటికే ప్రసాద్ మృతదేహం వద్ద తల్లి రోదిస్తుండటంతో.. ''ఏడిస్తే నిన్నుకూడా చంపుతాను. తమ్ముడిని చంపింది నేనే'' అంటూ ఆమెను బెదిరించినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం ఎడమ బొటనవేలికి అయిన గాయానికి ఈ నెల 20న తెల్లవారుజామున గీసుగొండలోని ఆర్ఎంపీ వైద్యుడిని ప్రవీణ్ సంప్రదించాడు. గాయం ఎలా అయిందని వైద్యుడు ప్రశ్నించగా.. తమ్ముడిని కత్తితో పొడిచి చంపే సమయంలో చేతికి గాయమైనట్లు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ప్రాథమిక చికిత్స అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోవాలని వైద్యుడు సూచించాడు.

కత్తి, రక్తపు మరకలున్న దుస్తులు స్వాధీనం

నిందితుడు ఇంటివైపు వస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారంతో సోమవారం పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించిన ప్రవీణ్.. హత్యకు ఉపయోగించిన కత్తి, ఆ సమయంలో ధరించిన దుస్తులను ఇంటి సమీపంలోని పొదల్లో దాచినట్లు తెలిపాడు. అతడి సమాచారంతో కత్తి, రక్తపు మరకలున్న దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్‌జోన్ వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్లూస్ టీం సంఘటనా స్థలంలో శాస్త్రీయ ఆధారాలను సేకరించింది. నిందితుడిని రిమాండ్ నిమిత్తం న్యాయస్థానం ముందు హాజరుపరిచినట్లు ఏసీపీ మామునూరు ఎన్. వెంకటేష్ తెలిపారు. కేసును 24 గంటల్లో ఛేదించి నిందితుడిని అరెస్టు చేసిన గీసుగొండ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్, ఎస్ఐలు అనిల్‌కుమార్, కుమార్, కానిస్టేబుళ్లు అరవింద్, విజయ్, ప్రవీణ్, భాస్కర్, రజినీకుమార్‌లను ఏసీపీ అభినందించారు.

టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్
కార్యాలయానికి ప్రథమ స్థానం



అక్షరశక్తి, హనుమకొండ: టీజీఎన్‌పీడీసీఎల్‌లో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉద్యోగులను ప్రోత్సహిస్తున్నామని సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. ఉద్యోగుల్లో పని ఒత్తిడిని తగ్గించి ఉల్లాసం, ఉత్సాహాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు నిజామాబాద్ కలెక్టర్ గ్రౌండ్స్, ఆఫీసర్స్ క్లబ్‌లో తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కంల ఇంటర్ సర్కిల్ టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. స్పోర్ట్స్ కౌన్సిల్, ఓఎంసీ టీజీ ట్రాన్స్‌కో నిజామాబాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 9 జట్లు టీమ్ ఈవెంట్‌లో, 16 జట్లు డబుల్స్ విభాగంలో పోటీపడ్డాయి. టేబుల్ టెన్నిస్ టీమ్ ఈవెంట్‌లో టీజీఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఓపెన్ డబుల్స్ విభాగంలో వి. వేణుబాబు, ఏ. సురేందర్ ప్రథమ స్థానాన్ని సాధించగా, ఓపెన్ సింగిల్స్ విభాగంలో వి. వేణుబాబు తృతీయ స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా విజేతలు చీఫ్ జనరల్ మేనేజర్ వి. వేణుబాబు, చీఫ్ ఇంజనీర్ ఏ. సురేందర్, జి. గణేష్ సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీఎన్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సంస్థలో ప్రతి ఉద్యోగి క్రీడల్లో పాల్గొనేలా అవసరమైన ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయాలు సాధించిన వి. వేణుబాబు, ఏ. సురేందర్, జి. గణేష్‌లను అభినందించారు. భవిష్యత్తులోనూ సంస్థ ఉద్యోగులు క్రీడా రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్లు వి. మోహన్ రావు, వి. తిరుపతి రెడ్డి, సి. ప్రభాకర్, జీఎం ఎం. హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శికి ఘన సన్మానం



అక్షరశక్తి, మడికొండ: హనుమకొండ జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మడికొండకు చెందిన కామని మల్లేష్‌ను మడికొండ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు బిల్ల రవీందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మల్లేష్‌ను శాలువా, పూలమాల, పుష్ప గుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన హనుమకొండ జిల్లా పద్మశాలి సంఘం పెద్దలు, మడికొండ సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పద్మశాలి కులబాంధవుల ఐక్యత, సంఘం అభివృద్ధి, సమాజ సేవా కార్యక్రమాల కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు వంగ రమేష్, పోతరాజు ప్రకాష్, దాసరి నవీన్, నల్ల హేమంత్, సురేష్, బేతిరామ్ తదితర సంఘ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు. అనంతరం నాయకులు కామని మల్లేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

శాస్త్రీయ దృక్పథంతోనే సమాజ అభివృద్ధి సాధ్యం



అక్షరశక్తి, హనుమకొండ: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, హేతుబద్ధమైన ఆలోచనా విధానాన్ని అలవర్చాలని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి సూచించారు. అంతర్జాతీయ శాంతి దినోత్సవ సందర్భంగా ఈరోజు ఆర్ట్స్ కళాశాల సోషల్ సైన్సెస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ప్రొఫెసర్ జ్యోతి మాట్లాడుతూ శాస్త్రీయ అవగాహనతోనే సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలు, అపోహలను తొలగించవచ్చని అన్నారు. విద్యార్థులు ప్రతి అంశాన్ని ప్రశ్నిస్తూ, పరిశీలిస్తూ వాస్తవాలను తెలుసుకునే విధంగా ఆలోచనా శక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. శాస్త్రీయ విజ్ఞానాన్ని సమాజ అభివృద్ధికి ఉపయోగించేలా విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు, ఎన్ఐటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కె. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సమాజంలో శాస్త్రీయ ఆలోచనా విధానం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మూఢనమ్మకాలను వీడి ప్రతి విషయాన్ని శాస్త్రీయ ఆధారాలతో పరిశీలించాలని విద్యార్థులకు సూచించారు. తప్పుడు సమాచారం, అపోహలను గుర్తించి వాస్తవాలను తెలుసుకోవడంలో శాస్త్రీయ దృక్పథం కీలకమన్నారు. ప్రపంచంలో యుద్ధాల వల్ల నష్టాలే తప్ప లాభాలు లేవు అన్నారు. ఆర్థికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజకీయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి. విజయ్ కుమార్, డాక్టర్ శేషు, డాక్టర్ ఈ. అంజన్ రావు, డాక్టర్ వి. నవీన్, డాక్టర్ ఏ. రవీందర్, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ శంకర్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

పర్యాటకంలో జానపద విజ్ఞానం ఎంతో అమూల్యమైనది

తెలుగు యూనివర్సిటీ ప్రొఫెసర్ గడ్డం వెంకన్న



అక్షరశక్తి, హనుమకొండ: పర్యాటక రంగ అభివృద్ధికి జానపద విజ్ఞానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలుగు యూనివర్సిటీ వరంగల్ పీఠాధిపతి ప్రొఫెసర్ గడ్డం వెంకన్న అన్నారు. ప్రభుత్వ పింగిలి మహిళా కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్సులో భాగంగా సోమవారం ఆయన రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని జానపద విజ్ఞానం-పర్యాటక రంగం మధ్య ఉన్న సంబంధంపై కీలక ఉపన్యాసం చేశారు. జానపద విజ్ఞానంలో ప్రజల ఆచారాలు, వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, వివాహాలు, జానపద కళలు, కథలు, భాష వంటి అనేక అంశాలు ఇమిడి ఉంటాయని ప్రొఫెసర్ గడ్డం వెంకన్న వివరించారు. పూర్వీకుల నుంచి కొనసాగుతున్న ఈ సంప్రదాయాలు నేటికీ గ్రామీణ ప్రాంతాలతో పాటు నగరాలకు వలస వచ్చిన ప్రజలలోనూ కనిపిస్తున్నాయని తెలిపారు. జానపద విజ్ఞానంలోని వివిధ అంశాలను పర్యాటక రంగంతో అనుసంధానం చేయవచ్చని చెప్పారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన గ్రామాలను గుర్తించి వాటి చరిత్ర, పండుగలు, ఉత్సవాలు, ఆచార వ్యవహారాలను పర్యాటకులకు పరిచయం చేయడం ద్వారా సాంస్కృతిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయవచ్చన్నారు. గ్రామాల్లోని వృక్ష సంపద, పర్యావరణం, జల వనరులను పర్యాటకంతో అనుసంధానం చేసి పర్యావరణ పర్యాటకాన్ని ప్రోత్సహించవచ్చని తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా కొనసాగుతున్న జానపద వైద్య విధానాలను కూడా పర్యాటక రంగంతో అనుసంధానం చేయవచ్చన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, వివాహ పద్ధతులు, జానపద కళలు దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించే అంశాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. జానపద విజ్ఞానానికి సంబంధించిన భాష, సాహిత్యం, వివిధ సామాజిక వర్గాల ఆచారాలు తదితర అంశాలను తెలుసుకోవడం ద్వారా తమకు కొత్త విషయాలు తెలిసాయని విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి చరిత్ర విభాగాధిపతి, సర్టిఫికెట్ కోర్సు కన్వీనర్ డాక్టర్ కొలిపాక శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. సుహాసిని, చరిత్ర అధ్యాపకురాలు బి. జ్యోతి, విద్యార్థినులు పాల్గొన్నారు.





భద్రకాళి లేక్ వ్యూ రెసిడెన్సీలో ఘనంగా వినాయక చవితి వేడుకలు

అక్షరశక్తి, హనుమకొండ: కాపువాడలోని భద్రకాళి లేక్ వ్యూ రెసిడెన్సీలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరాంకుశం శ్రీమన్నారాయణ అయ్యగారి సారథ్యంలో గణపతి హోమ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ హోమ కార్యక్రమంలో శేర్ల కుమారస్వామి కుటుంబ సభ్యులు, బేతి శ్రవణ్ కుటుంబం, విద్యాసాగర్ కుటుంబం, వి. మల్లికార్జున్ కుటుంబం, రాజ్ కుమార్ కుటుంబ సభ్యులు గణపతి హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమ క్రతువు అనంతరం అయ్యగారి ఆశీర్వచనం జరిగింది. అనంతరం కె. గురుపాల్ రెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతిని పూజించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



అక్షరశక్తి, భూపాలపల్లి: ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యమని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి మొత్తం 16 ఫిర్యాదులు అందగా.. ప్రతి ఫిర్యాదును ఎస్పీ స్వయంగా విని సంబంధిత సీఐలు, ఎస్ఐలతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి పైరవీలు, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ ద్వారా సమస్యలను నేరుగా తెలుసుకుని సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తుందని తెలిపారు.

ఏకాగ్రతతో చదివితే లక్ష్య సాధన సులభం



అక్షరశక్తి, హనుమకొండ: స్పష్టమైన లక్ష్యంతో ఏకాగ్రతతో చదివితే పోటీ పరీక్షల్లో విజయం సాధించడం సులభమని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచితంగా కరెంట్ అఫైర్స్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ అభ్యర్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు క్రమశిక్షణ, సమయపాలన, ఏకాగ్రత కీలకమన్నారు. రాబోయే మూడు నెలలు మొబైల్ ఫోన్ వినియోగాన్ని తగ్గించి చదువుపైనే దృష్టి సారించాలని సూచించారు. నేటి కష్టమే రేపటి విజయానికి పునాది అని, ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పుస్తక దాత పి. విష్ణు, స్టడీ సెంటర్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీఎల్ఎస్ఏ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా సుజయ్ రణదేవ్



అక్షరశక్తి, పరకాల: తెలంగాణ న్యాయ విద్యార్థుల సంఘం (టీఎల్ఎస్ఏ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా పరకాలకు చెందిన న్యాయవాది దుప్పటి సుజయ్ రణదేవ్ నియమితులయ్యారు. టీఎల్ఎస్ఏ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కె. బలునాయక్ ఆదేశాల మేరకు నియామకం జరిగినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాత్విక్ తెలిపారు. ఈ సందర్భంగా సుజయ్ రణదేవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తూ సంస్థ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. న్యాయ విద్యార్థుల సమస్యలు, సంక్షేమం, అభ్యున్నతి, హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తానన్నారు. న్యాయ విద్యా వ్యవస్థలోని లోపాలు, విద్యార్థుల సమస్యలపై పోరాడడంతోపాటు పేదలు, పీడిత వర్గాలు, మారుమూల ప్రాంతాల ప్రజలకు న్యాయ హక్కులపై అవగాహన కల్పిస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉమ్మడి జిల్లా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు



అక్షరశక్తి, ములుగు: ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు సమర్పించిన దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వకుండా సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ములుగు ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్, ఎం. సంపత్‌రావు, జిల్లా రెవెన్యూ అధికారి రవికుమార్‌లతో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 30 దరఖాస్తులు అందగా, భూ సమస్యలకు 8, ఇందిరమ్మ ఇళ్లకు 5, పింఛన్లకు 4, ఉద్యోగాలకు 6, ఇతర సమస్యలకు 7 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి, పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గణపతి పూజలు, క్విజ్ పోటీలు





అక్షరశక్తి, హసన్ పర్తి: 66వ డివిజన్ పరిధిలోని కాకతీయ వ్యాంటేజ్ కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం 128 ప్రసాదాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే సోమవారం కాలనీ గణేష్ మండపం వద్ద చిన్నారులకు క్విజ్ పోటీ నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని పోటీలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమాన్ని డి.శ్రీహిత, బి.స్నేహిత ఆధ్వర్యంలో, కాకతీయ వ్యాంటేజ్ వెల్ఫేర్ అసోసియేషన్ (కేవీవీడబ్ల్యూఏ) కమిటీ నిర్వహించింది. పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యావసర ధరలు నియంత్రించాలి

అక్షరశక్తి, హనుమకొండ: నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నియంత్రించి రేషన్ షాపుల ద్వారా 13 రకాల నిత్యావసర వస్తువులను ప్రజలకు అందించాలని ఏఐఎఫ్‌డీడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగాల రాగసుధ డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాగసుధ మాట్లాడుతూ బియ్యం, పప్పులు, వంట నూనెలు, కూరగాయలు, పాలు, గుడ్లు తదితర నిత్యావసరాల ధరలు పెరగడంతో సామాన్య కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోందన్నారు. ధరల పెరుగుదల ప్రభావాన్ని మహిళలు తీవ్రంగా ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం మార్కెట్ ధరలను నియంత్రించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు. రేషన్ షాపుల ద్వారా 13 రకాల వస్తువులను అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి సంధ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నబోయిన ప్రేమలత, ప్రత్యూష, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.రెడ్డి రాజేంద్ర, గడ్డం సుధారాణి, అరుణ, లక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.



భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ పనులు వేగవంతం చేయాలి

- 2026–27లో భూసేకరణకు రూ.6 వేల కోట్లు
- ఇప్పటికే రూ.2,550 కోట్లు విడుదల..
- అవార్డులు జారీ చేసిన భూములకు తొలుత పరిహారం
- కలెక్టర్లతో మంత్రులు, సీఎస్ వీడియో కాన్ఫరెన్స్



అక్షరశక్తి, హనుమకొండ: నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం-పునరావాస పునరుద్ధరణ (ఆర్‌అండ్‌ఆర్) పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అంశాలపై సోమవారం రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హనుమకొండ నుంచి జిల్లా కలెక్టర్ చాహత్‌బాజ్‌పాయి పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.1,050 కోట్లు, తాజాగా రూ.1,500 కోట్లు కలిపి రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. విడుదలైన నిధులను అధికారుల ఖాతాల్లో ఉంచకుండా లబ్ధిదారులకు పరిహారం చెల్లించాలని ఆదేశించారు. నిధులు సరిపోకపోతే అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. భూసేకరణకు ప్రత్యేక అధికారులను నియమించి, ప్రతి వారం పురోగతిని సమీక్షించాలని మంత్రి ఆదేశించారు. నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులతో నేరుగా చర్చించి, స్నేహపూర్వక వాతావరణంలో భూసేకరణ పూర్తి చేయాలని, నిబంధనల ప్రకారం మార్కెట్ విలువకు సాధ్యమైనంత సమీపంగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయ్యే లోపు పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా భూసేకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.

అవార్డు భూములకు తొలుత పరిహారం

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యంగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. అవార్డు అనంతరం కూడా పరిహారం చెల్లింపుల్లో జాప్యం జరిగితే ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందన్నారు. పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ.3,100 కోట్ల విలువైన పనులను గుర్తించగా, రూ.2,514 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పరిహారం నేరుగా రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూముల ధరలు పెరగడంతో అధిక పరిహారం కోసం డిమాండ్లు రావడం వల్ల కొన్నిప్రాంతాల్లో జాప్యం జరుగుతోందన్నారు. జిల్లా కలెక్టర్ చాహత్‌బాజ్‌పాయి మాట్లాడుతూ జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, ఇతర పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రవి, ఆర్డీవో వెంకటేశ్వర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ నెల 26న ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

- కంబాలపల్లి పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



అక్షరశక్తి, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లాలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను సెప్టెంబర్ 26, 2026న కంబాలపల్లి చెరువు వద్ద ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని సహజ సౌందర్యం, చెరువులు, జలపాతాలు, చారిత్రక, ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక ప్రదేశాలను ప్రజలకు పరిచయం చేయడంతో పాటు, జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. కంబాలపల్లి చెరువుతో పాటు బయ్యారం చెరువు, గుండేడు ముసలమ్మ దేవాలయం, కురవి వీరభద్రస్వామి దేవాలయం, బీముడి పాదం జలపాతం తదితర పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, సుందరీకరణ, సందర్శకులకు అనుకూలమైన వాతావరణం ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యాటక ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్థానిక కళలు, సంప్రదాయాలు మరియు జిల్లా సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు ఘన సన్మానం

అక్షరశక్తి, వరంగల్: నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ (బాలికల) పోటీల్లో తృతీయ స్థానం సాధించిన వరంగల్ జిల్లా క్రీడాకారులను సోమవారం ఘనంగా సన్మానించారు. వరంగల్‌లోని ఓ సిటీ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్ క్రీడాకారులను శాలువాలతో సత్కరించారు. జిల్లా క్రీడాకారులకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. డీవైఎస్‌వో బి. అనిల్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో వరంగల్ జట్టు ప్రతిభ కనబర్చడం అభినందనీయమన్నారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పూజారి అశోక్‌బాబు మాట్లాడుతూ జట్టు తృతీయ స్థానం సాధించడంలో క్రీడాకారిణి ఏ. తనుశ్రీ అత్యుత్తమ ఆటతీరు కనబరిచారని తెలిపారు. జట్టు విజయం పట్ల ఉమ్మడి వరంగల్ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పిల్లి సాంబశివరావు, తాబేటి రాజేందర్, పెరుమాండ్ల సాంబమూర్తి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోశాధికారి భీమగాని ముఖర్జీ, సృజన ప్రసాదరావు, కోచ్ శ్రీకాంత్, మేనేజర్ ధనుష్, పీఈటీ ఎస్. ఈశ్వర్, పి.ప్రశాంత్, తల్లిదండ్రులు, క్రీడాకారులు తనుశ్రీ, అచ్యుత, శ్రీజ, శుభకీర్తి, అక్షిత, అక్షయ, ఎండీ సన తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 23న జాబ్ మేళా

అక్షరశక్తి, మహబూబాబాద్ : హైదరాబాద్‌లోని "అపోలో ఫార్మసీ" సంస్థలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సెప్టెంబర్ 23, 2026న మహబూబాబాద్‌లోని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి టి. రజిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ సంస్థలోని ఫార్మసిస్ట్, ట్రైనీ ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్ 18 - 35 సంవత్సరాలు (స్త్రీ / పురుషులు) వయసు కలిగి అభ్యర్థులు ఫార్మసిస్ట్, ట్రైనీ ఫార్మసిస్ట్ పోస్టులకు D.Pharm / B.Pharm / M.Pharm (తెలంగాణ PCI సర్టిఫికేట్ ఉండవలెను) ఫార్మసీ అసిస్టెంట్ పోస్టునకు 10వ తరగతి / ఇంటర్మీడియట్ / డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు తమ వివరాలు, ధ్రువపత్రాలతో సెప్టెంబర్ 23న జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం, మహబూబాబాద్ నందు జరిగే జాబ్ మేళాకు హాజరు కావాల్సిందిగా ఈ సందర్భంగా ఆ అధికారి కోరారు.

మూడు బడులకు.. కొత్త భవనాలెప్పుడు?

- శిథిల భవనాలు.. అద్దె గదుల్లో తరగతులు
- ఒకే గదిలో 116 మంది విద్యార్థులకు బోధన
- 28 ఏళ్లుగా సొంత భవనం లేక అవస్థలు
- ప్రజావాణిలో కలెక్టర్‌కు టీపీజేఏసీ, తల్లిదండ్రుల వినతి







నిర్మాణం మధ్యలోనే నిలిచిన MPPS హనుమంతునిగూడెం



గత 28సం. లుగా MPPS రామన్నపేట ST కాలనీ కి స్వంత పాఠశాల భవనం లేక అదీభవనంలోనే పాఠశాల నిర్వహణ

అక్షరశక్తి, మహబూబాబాద్, సెప్టెంబర్ 21: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల దుస్థితిపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. 13, 17, 20వ వార్డుల్లోని మూడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు సొంత భవనాలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక పాఠశాల శిథిలావస్థకు చేరడంతో అద్దె భవనంలో నిర్వహిస్తుండగా.. మరో పాఠశాలలో 116 మంది విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి బోధన కొనసాగిస్తున్నారు. ఇంకో పాఠశాల ఏకంగా 28 ఏళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. దీంతో విద్యార్థుల భద్రత, విద్యాబోధనపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించి మూడు పాఠశాలలకు నూతన భవనాలు నిర్మించాలని కోరుతూ టీపీజేఏసీ ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల తల్లిదండ్రుల ప్రతినిధులు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

రెండేళ్లుగా అద్దె భవనంలోనే..

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పత్తిపాకలో ఉన్న ఎంపీపీఎస్ పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దీంతో అధికారుల ఆదేశాల మేరకు సుమారు రెండేళ్లుగా పాఠశాలను ఖాళీ చేసి అదే ప్రాంతంలోని ప్రైవేట్ అద్దె భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 55 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒకే గదిలో 116 మంది..

హనుమంతునిగూడెంలోని ఎంపీపీఎస్ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. సుమారు ఆరేళ్ల క్రితమే పాఠశాల భవనం కూలిపోయే స్థితికి చేరడంతో విద్యార్థులను తాత్కాలికంగా మరో పాఠశాలకు తరలించారు. ప్రస్తుతం 116 మంది విద్యార్థులను ఒకే గదిలో ఉంచి బోధన కొనసాగిస్తున్నారని టీపీజేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఇంతమంది విద్యార్థులకు ఒకే గదిలో తరగతులు నిర్వహించడం వల్ల విద్యాబోధనకు తీవ్ర ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు.

28 ఏళ్లుగా అద్దె భవనమే..

రామన్నపేట ఎస్టీ కాలనీలోని ఎంపీపీఎస్ పరిస్థితి కూడా ఏళ్లుగా మారలేదు. సుమారు 28 సంవత్సరాలుగా ఈ పాఠశాలకు సొంత భవనం లేక అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఇంత సుదీర్ఘకాలంగా సమస్య పరిష్కారం కాకపోవడంపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించి విద్యార్థులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని టీపీజేఏసీ నాయకులు పేర్కొన్నారు. శిథిల భవనాలు, అద్దె గదులు, తాత్కాలిక ఏర్పాట్ల మధ్య విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి లేకుండా చూడాలని కోరారు. మూడు పాఠశాలలకు నూతన భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేసి, నిర్మాణ పనులు ప్రారంభించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. "ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు కల్పించి విద్యార్థుల భద్రతను కాపాడాలి. అద్దె భవనాలు, తాత్కాలిక ఏర్పాట్లతో విద్యార్థుల విద్యకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి" అని టీపీజేఏసీ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో టీపీజేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ మైసా శ్రీనివాసులు, జిల్లా కోకన్వీనర్ ఎన్‌కే. జానీ, బి. అంజయ్య, బి. రాజు, పత్తిపాక, హనుమంతునిగూడెం పాఠశాలల తల్లిదండ్రులు బి. రజిత, బి. మౌనిక, బి. సుప్రియ, ఎన్. రమ, ఎస్. లలిత, కె. విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.





పూర్తిగా శిథిలావస్థలో ఉన్న MPPS పత్తిపాక

ఉద్యోగాల నియామకం సర్వేలో పేర్లు నమోదు చేసుకోవాలి..

జిల్లా ఉపాధి అధికారి రజిత

అక్షరశక్తి, మహబూబాబాద్ : జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు, మహబూబాబాద్ జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు సంబంధించిన ఉద్యోగ అవసరాలు, ఉద్యోగ ప్రాధాన్యతలను తెలుసుకునేందుకు Job Requirement Survey నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారిని రజిత తెలిపారు. Job Mela - Job Requirement Survey పోస్టర్‌తో పాటు QR కోడ్‌ను మహబూబాబాద్ జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలలోని యువతకు విస్తృతంగా చేరేలా ప్రచారం చేయాలని కోరారు. ప్రతి గ్రామం, మున్సిపాలిటీలోని యువతకు ఈ సమాచారం చేరేలా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక సంస్థల ప్రతినిధులు సహకరించి, గరిష్ఠ సంఖ్యలో యువత ఈ సర్వేలో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరుతున్నామని వివరించారు. ఈ మేరకు పూర్తి వివరాల కోసం సంప్రదించవలసిన వారు - మహబూబాబాద్ జిల్లా ఉపాధి అధికారి రజిత 91 98661 42287, శ్రీమన్నారాయణ రెడ్డి జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఫోన్ 91 93983 27435, రాజేంద్రప్రసాద్, జిల్లా పౌర సంబంధాల అధికారి 91 99081 52878 ఫోను నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని కోరారు.

ఆయుర్వేదిక్ హాస్పిటల్ సూపరింటెండెంట్ ధర్మరాజు సన్మానం



అక్షరశక్తి, వరంగల్ : ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ రామన్నపేటలోని డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్, వెలాసిటీ నాగేందర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య రంగంలో సేవలందిస్తున్న ఆయుర్వేదిక్ హాస్పిటల్ సూపరింటెండెంట్ ధర్మరాజును ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజలకు గతంలో కంటే ప్రస్తుతం అన్ని రకాల ఆయుర్వేద మందులు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు వైద్య సేవలు అందిస్తున్న ధర్మరాజు సేవలను గుర్తించి సన్మానించినట్లు తెలిపారు. ఆయుర్వేద వైద్యాన్ని మరింత ప్రజలకు చేరువ చేస్తూ సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయుర్వేద అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న కృషిని అభినందించారు. ఆయుర్వేద వైద్యంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం హాస్పిటల్ సూపరింటెండెంట్ ధర్మరాజు మాట్లాడుతూ తనను సన్మానించడం మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఆయుర్వేద అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్, ఆర్గనైజర్ ప్రవణ్, నల్ల సత్యనారాయణ, పి. రాజు, ఆఫీస్ సూపరింటెండెంట్ దేవిక, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ పనులు వేగంగా పూర్తి గా చేయాలి





అక్షరశక్తి, వరంగల్: వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జె. చోంగ్తూ, ఐఏఎస్, వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ వాణి సోమవారం వరంగల్ లోని నూతనంగా నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య కార్యదర్శిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సందర్శించి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులోకి రానున్న వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసేలా సంబధిత శాఖల సమన్వయంతో పని చేయాలని సూచించారు.

GUEST COLUMN

12 ఏళ్ళ బీజేపీ పాలనలో ప్రశ్నలు అనేకం–మోదీ మౌనం



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

2014 నుంచి బీజేపీ ప్రభుత్వం తరపున భారత ప్రజలకు అభివృద్ధి, దేశభక్తి, త్యాగం, క్రమశిక్షణ పేరుతో ఎన్నో పిలుపులు వచ్చాయి. పెద్ద నోట్ల రద్దు నుంచి కొవిడ్ దీపాల వరకు, వ్యవసాయ చట్టాల నుంచి డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వరకు ప్రజలు ప్రభుత్వ నిర్ణయాల భారాన్ని మోశారు. కానీ ప్రజాస్వామ్యంలో అసలు ప్రశ్న "ప్రజలు ప్రభుత్వం చెప్పింది చేశారా?" అనేది కాదు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏమి నెరవేర్చింది? ఎవరి జీవితాలు మెరుగుపడ్డాయి? ఎవరి మీద భారాలు పెరిగాయి? లాభాలు ఎవరికి వచ్చాయి, నష్టాలు ఎవరు భరించారు?" అనేదే ప్రధాన ప్రశ్నలు. ఈ ప్రశ్నలను శ్రమజీవి, రైతు, చిన్న వ్యాపారి, ఉద్యోగార్థి, మధ్యతరగతి కుటుంబం అనే ప్రజా దృక్కోణంలో చూస్తే 2014 తర్వాతి పాలనపై మరింత కఠినమైన లెక్కలు అడగాల్సి వస్తుంది.

మొదట నోట్ల రద్దు. 2016 నవంబర్ 8న రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేస్తూ నల్లధనం, నకిలీ కరెన్సీ, ఉగ్రవాద నిధులపై దెబ్బగా ప్రభుత్వం నిర్ణయాన్ని సమర్థించింది. కానీ రిజర్వ్ బ్యాంక్ లెక్కల ప్రకారం రద్దయిన నోట్లలో రూ.15.31 లక్షల కోట్ల విలువైన నోట్లు తిరిగి వచ్చాయి. అంటే రద్దయిన కరెన్సీలో దాదాపు 99.3 శాతం బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చింది. అదే సమయంలో రిజర్వ్ బ్యాంక్ 201718లో నోట్ల ముద్రణ, భద్రతా ముద్రణ తదితర ప్రక్రియలపై భారీ వనరులు వినియోగించాల్సి వచ్చిందని తెలిపింది.నోట్ల రద్దు వల్ల పన్ను అనుసరణ, డిజిటల్ చెల్లింపులు వంటి కొన్ని మార్పులు వచ్చాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, "నల్లధనం నిర్మూలన" అనేది అసలు సమస్యగా చెప్పిన బీజేపీ అది ఆచరణలో జరగలేదు. నోట్ల రద్దు అనేది కేవలం ప్రచార ఆర్భాటంగా మిగిలింది,ఫలితంగా సామాన్య ప్రజలు నానా అగచాట్లు పడ్డారు తప్ప నోట్లరద్దు వల్ల ఏం మేలు జరిగిందో ఈ ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం నుండి ప్రజలకు స్పష్టమైన జవాబు చెప్పలేదు.బడా బాబులు డబ్బుకోసం బ్యాంకుల ముందు ఎవరూ క్యూలో నిలబడలేదు.కొత్త నోట్ల ప్రింటింగ్ ఖర్చు కేంద్ర ప్రభుత్వానికి అదనపు భారం అయింది. ఈ కొత్త నోట్లు ప్రింటింగ్ ప్రెస్ నుంచి ధనికుల ఇళ్ళకు నేరుగా లారీల కొద్ది నోట్ల కట్టలు సేఫ్ గా చేరాయి.

జీఎస్టీని "గుడ్ అండ్ సింపుల్ ట్యాక్స్"గా పరిచయం చేశారు. కానీ పన్ను సంస్కరణ ప్రయోజనాలను అంచనా వేయాలంటే పెద్ద కార్పొరేట్ సంస్థల దృష్టితో మాత్రమే చూడటం సరిపోదు. చిన్న దుకాణదారు, స్వయం ఉపాధి కార్మికుడు, చిన్న తయారీదారు, సేవా రంగంలోని సూక్ష్మ సంస్థపై అనుసరణ ఖర్చు ఎంత పడింది? వారి వ్యాపారం, ఆదాయం, ఉద్యోగాలపై ప్రభావం ఏమిటి? ఇవే ప్రజా ఆర్థిక దృష్టిలో కీలక ప్రశ్నలు. జీఎస్టీ ద్వారా పన్ను వ్యవస్థలో మార్పులు వచ్చినా, పన్ను సేకరణ పెరగడం మాత్రమే ప్రజల జీవన ప్రమాణం పెరిగిందనడానికి ప్రమాణం కాదు.

ఉద్యోగాల విషయంలో మరింత తీవ్రమైన ప్రశ్న ఉంది. "ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు" అనే ఎన్నికల హామీ రాజకీయ చర్చలో విస్తృతంగా నిలిచింది.బీజేపీ వాగ్దానం మేరకు ఈ 12ఏళ్ళ కాలం 24 కోట్ల ఉద్యోగాలు ఇచ్చి ఉండాల్సింది. కానీ ఇదొక బూటకపు ప్రకటనగా దేశ చరిత్రలో నిలిచింది. తాజా ప్రభుత్వ పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం 2025లో 15-29 ఏళ్ల యువత నిరుద్యోగిత రేటు 9.9 శాతం; పట్టణ యువతలో అది 13.6 శాతం. 2025లో 15 ఏళ్లు పైబడిన విద్యావంతుల నిరుద్యోగిత కూడా 6.5 శాతంగా నమోదైంది. మరోవైపు 2025లో స్వయం ఉపాధి వాటా 56.2 శాతంగా ఉంది. అంటే "ఉద్యోగం" అనే పదం వెనుక స్వయం ఉపాధి, అసంఘటిత పని, స్థిర వేతన ఉద్యోగం మధ్య ఉన్న తేడాను గుర్తించాలి. ప్రజలకు కావాల్సింది కేవలం ఉపాధి సంఖ్య కాదు; స్థిరమైన ఉద్యోగం, గౌరవప్రదమైన వేతనం, సామాజిక భద్రత.

రైతుల విషయంలో 2020లో మూడు వ్యవసాయ చట్టాలు తీసుకొచ్చి, ఏడాది పాటు జరిగిన తీవ్ర ఉద్యమం తరువాత 2021లో వాటిని రద్దు చేయాల్సి వచ్చింది. రైతు ఉద్యమ సమయంలో మరణించిన వారి సంఖ్యపై ప్రభుత్వం అధికారిక గణాంకం లేదని పార్లమెంటుకు తెలిపింది; అదే సమయంలో రైతు సంఘాలు 700కు పైగా మరణాలను ప్రస్తావించాయి.ఇప్పటికీ రైతు ఆత్మహత్యల సమస్య మాత్రం ఉద్యమానికి అతీతంగా కొనసాగుతోంది. అధికారిక పార్లమెంటరీ గణాంకాల ప్రకారం 2019లో 5,957 మంది రైతులు/సాగుదారుల ఆత్మహత్యలు నమోదైతే, 2020లో 5,579, 2021లో 5,318 నమోదయ్యాయి. వ్యవసాయ సంస్కరణల చర్చలో రైతు ఆదాయం, కనీస మద్దతు ధర, రుణభారం, మార్కెట్ శక్తి, ఇన్‌పుట్ ఖర్చులు ప్రధాన స్థానంలో ఉండాలి.కానీ రైతు బ్రతుకులు బీజేపీ పాలనలో ఛిద్రం అయ్యాయి.

ఇంధన ధరలు సామాన్యుడి జీవితంపై పడే పరోక్ష పన్నుల్లాంటివి. పెట్రోల్, డీజిల్ జీఎస్టీ పరిధిలో లేవు; కేంద్ర సుంకాలు, రాష్ట్రాల వ్యాట్ రెండూ ధరలో భాగం. 2026 సెప్టెంబర్ నాటికి కేంద్రం పెట్రోల్‌పై వివిధ రూపాల్లో లీటరుకు సుంకాలు విధిస్తుండగా, రాష్ట్రాల మధ్య వ్యాట్ రేట్లు గణనీయంగా మారుతున్నాయి. తెలంగాణలో పెట్రోల్‌పై 35.20 శాతం, డీజిల్‌పై 27 శాతం వ్యాట్ ఉందని పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ చూపిస్తోంది. కాబట్టి ధరల బాధ్యతను పూర్తిగా కేంద్రానికో, రాష్ట్రాలపైకో నెట్టేయడం కాకుండా కేంద్రం-రాష్ట్రాల పన్నుల మొత్తం భారాన్ని ప్రజల ముందుంచాలి.బీజేపీ ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముందు సాగిలపడటం మూలంగా ,వెనుజులా , రష్యా, ఇరాన్ నుండి కారుచౌకగా మనం ఇంధన వనరులను సమకూర్చుకోలేక పోయాము. మన దౌత్యం ఈ విషయంలో పూర్తిగా విఫలం అయింది. చైనా అమెరికా ఆంక్షలను ఎదిరించింది.తన దేశ ఇంధన వనరులను సజావుగా పొందుతుంది. మోదీ ప్రభుత్వానికి ట్రంప్ ను ఎదిరించే దమ్ము, ధైర్యం లేకపోయింది. మోదీ మొఖాన ఎన్ని సార్లు ట్రంప్ అవమానపరుస్తూ,ఈసడింపుగా మాట్లాడాడో లెక్క లేదు. భారత దేశ చరిత్రలో ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ భారత ప్రధానమంత్రి కి ఇంత అవమానం ఎన్నడూ జరగలేదు. గత భారత దేశ ప్రధాన మంత్రులు ఎవరూ ఇంత అవమానాన్ని భరించ లేదు.అయినా అమెరికా అధ్యక్షుడు ప్లాంటుకు ఘాటుగా సమాధానం ఇవ్వకుండా మోదీ మౌనాం పాటించారు.

కొవిడ్ సమయంలో చప్పట్లు, పళ్లెం శబ్దాలు, దీపాల కార్యక్రమాలు ఆరోగ్య కార్యకర్తలకు సంఘీభావ సూచికలుగా అశాస్త్రీయ ఆదేశాలు ఇచ్చారు. మోదీకి ప్రచారం, ప్రదర్శనలు ఇవ్వడం ఇష్టం. ప్రజలు కూడా గుడ్డిగా మోదీ మాటలు నమ్మారు. కానీ కోవిడ్ మహమ్మారి రెండో దశలో ఆక్సిజన్, ఆసుపత్రి పడకలు, వైద్య మౌలిక వసతుల కొరత దేశాన్ని తీవ్రంగా కుదిపేసింది. శవాలు వేలసంఖ్యలో గంగా నదిలో తేలాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 5 కోట్ల మందికి పైగా చనిపోయారు. వాస్తవానికి ఈ మరణాలు అనేక రెట్లు అధికంగా ఉన్నాయి అని అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ తేల్చింది. ప్రజాస్వామ్య సమాజంలో సంక్షోభ సమయంలో ప్రతీకాత్మక ఐక్యతతో పాటు ప్రాణాలను కాపాడే ప్రజారోగ్య మౌలిక వసతులే ప్రభుత్వ పనితీరుకు అసలు కొలమానం. కానీ నేటికీ ఈ విషయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో వసతుల సంగతి తెలిసిందే. ప్రయివేట్, కార్పొరేట్ ఆసుపత్రుల నగ్న దోపిడీ తెలిసిందే. దేశంలో ఫార్మా కంపెనీల డ్రగ్ మాఫియా సంగతి ప్రజల అనుభవంలో ఉన్నదే.

ఎన్నికల బాండ్ల వ్యవహారం ప్రజాస్వామ్యంలో డబ్బు-అధికారం సంబంధాన్ని మరింత స్పష్టంగా ముందుకు తెచ్చింది. సుప్రీంకోర్టు 2024 ఫిబ్రవరిలో బాండ్ల పథకాన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటిస్తూ, రాజకీయ పార్టీల నిధులపై సమాచారాన్ని ప్రజలకు దాచడం సమాచార హక్కుకు విరుద్ధమని పేర్కొంది. కంపెనీలకు అపరిమిత రాజకీయ విరాళాలకు అనుమతినిచ్చిన మార్పులను కూడా కోర్టు కొట్టివేసింది. ఎన్నికల సంఘం విడుదల చేసిన సమాచారంపై ఏడీఆర్ విశ్లేషణ ప్రకారం 201718 నుంచి 202223 వరకు బాండ్ల ద్వారా వచ్చిన విరాళాల్లో బీజేపీకి రూ.6,565.98 కోట్లు, అంటే 54.77 శాతం లభించాయి. ఇక్కడ ప్రశ్న ఒక పార్టీకి వ్యతిరేకంగా కాదు; రాజకీయ అధికారం-కాంట్రాక్టర్లు, పారిశ్రామిక వేత్తలు కార్పొరేట్ డబ్బు మధ్య సంబంధం ఓటరుకు పూర్తిగా కనిపించాలా లేదా? ఇప్పటికీ ప్రపంచంలో ఏ దేశంలో, ఏ పార్టీ కి ఇంత మూలధనం బీజేపీకి లభించినంతగా ఎవరికీ లభించలేదు.సుప్రీం కోర్టు తప్పు పట్టినా...మరో పేరుతో ఈ సరఫరా నేటికీ కొనసాగుతుంది.

మణిపూర్ విషయంలో 2023లో హింస ప్రారంభమైన తరువాత కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకారం 2023 ఆగస్టు నాటికి 152 మంది మరణించారు, 1,106 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి, దాదాపు 14,898 మందిని అరెస్టు చేశారు. హింసకు కారణాలు, అధికారుల వైఫల్యాలు పరిశీలించేందుకు కేంద్రం విచారణ కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసింది. అయినప్పటికీ బాధితుల పునరావాసం, న్యాయం, శాశ్వత శాంతి వంటి చర్యలు తీసుకోలేదు. నేటికీ మణిపూర్ రావణాసురుని కాష్టంలా రగులుతూనే ఉంది.

చివరగా మీడియా. అధికారాన్ని ప్రశ్నించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా ప్రాథమిక బాధ్యత. కానీ ప్రభుత్వ అనుకూలమైనా మీడియా గోదీ మీడియాగా ప్రసిద్ధి పొందింది.అవి మోదీ భజన మండళ్లుగా మారాయి. ప్రతిపక్ష అనుకూలమైనా జర్నలిజంపై ఆంక్షలు పెరిగాయి.భారత మీడియా స్వేచ్ఛా పై ప్రపంచ స్థాయి ఇండెక్స్ లో 157 స్థానానికి పడిపోయింది. కేంద్ర ప్రభుత్వ లెక్కలు, ఆర్థిక ఆధారాలను ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్ నమ్మే పరిస్థితి లేదు. దేశ ఆర్థిక పరిస్థితి వాస్తవాలు,146 కోట్ల ప్రజల్లో సామాన్య ప్రజా నిత్య జీవన స్థాయి అనే ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది.అదానీ, అంబానీ లాంటి కొద్ది మంది ప్రపంచ స్థాయి సంపన్నుల స్థాయికి చేరుకుంటే అది ఆర్థిక ప్రగతి అని చెప్పలేము. అదే సమయంలో అధికారాన్ని ప్రశ్నించే స్వరాలను, మీడియాపై ఆంక్షలు రుద్దటం, జర్నలిస్ట్ లు, సంపాదకులపై కేసులు పెట్టి జైళ్ళ పాలు చేశారు . కోర్టులు అవి ఆధారాలు లేనివిధంగా తేల్చాయి. భారత్ లో దేశభక్తి-దేశద్రోహం అనే ద్వంద్వంలో మీడియా స్వేచ్ఛను బంధించడం ప్రజాస్వామ్య చర్చను కుదిస్తుంది.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ గురించి జీడీపీ వృద్ధి గణాంకాలు చెప్పే కథ ఒకటి; కుటుంబాల జీవన వ్యయం, ఉపాధి, వేతనాలు, రైతు ఆదాయం చెప్పే కథ మరొకటి. 202324 కుటుంబ వినియోగ వ్యయ సర్వేలో గ్రామీణ వినియోగ అసమానత గణాంకాలలో 0.237, పట్టణ ప్రాంతంలో 0.284గా నమోదైంది. ఈ గణాంకాలు అసమానత తగ్గిందనే అధికారిక సూచన ఆచరణలో కనపడటం లేదు 80 కోట్ల మంది ప్రజలు సబ్సిడీ ఆహార ధాన్యాలపై ఆధారపడుతున్నారు.

అందుకే ప్రతి బడ్జెట్‌లో, ప్రతి ఎన్నికలో, ప్రతి పెద్ద విధాన నిర్ణయంలో ప్రజల లెక్క అడగాల్సిన ప్రశ్న ఒక్కటే: ఆర్థిక వృద్ధి ఫలాలు ఎవరికి చేరాయి? శ్రమించిన ప్రజలకు ఎంత దక్కింది? కార్పొరేట్ రంగానికి ఎంత లాభం వచ్చింది? రైతు, కార్మికుడు, చిన్న వ్యాపారి, నిరుద్యోగ యువత, మధ్యతరగతి కుటుంబం ఎంత భారం మోశాయి?

ప్రజలు దేశం కోసం త్యాగం చేయాలని ప్రభుత్వాలు అడగడం కొత్త కాదు. కానీ ప్రజాస్వామ్యంలో త్యాగం చేయాల్సింది ఎప్పుడూ ప్రజలే, లాభం పొందేది ఎప్పుడూ గద్దెనెక్కిన కొద్దిమందే అనే భావనకు తావు ఉండకూడదు. ప్రజల నుంచి విధేయతను కోరే రాజకీయానికి బదులు, ప్రజల ముందు ఖర్చు పెట్టే ప్రతి రూపాయికీ లెక్క చెప్పే పారదర్శక పాలన అవసరం.కోవిడ్ సమయంలో మోదీ పిలుపును ఆవేశంగా గుడ్డిగా నమ్మకంతో పళ్లెలు, చప్పట్లు కొట్టిన చేతులు ఇప్పుడు గణాంకాల చిట్టా విప్పమని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి అడుగుతున్నాయి. దీపాలు వెలిగించిన అంధ భక్తులే ఇప్పుడు లెక్కల పుస్తకం తెరవమంటున్నాయి. "ప్రజలు కేవలం ఓట్లు వేసే భక్తులు మాత్రమే కాదు—— ఈ యువతరం నవ పౌరులు చప్పట్లు కొట్టడానికే కాదు, అధికారాన్ని నిలబెట్టి ప్రశ్నించడానికి జన్‌జీ, ఆల్ఫాజీ కూడా సిద్ధంగా ఉన్నారు."

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.

డబ్బు కోసం రాజకీయాల్లోకి రాలేదు

వైద్యం, ప్రజా సేవలో సంతృప్తి

విద్యే బీసీల ఎదుగుదలకు ప్రధాన ఆయుధం

- కుల వివక్షే కసిగా మారింది
- వైద్యుడిగా ఎదిగినా.. రాజకీయాలపై మొదటి నుంచే గురి
- ఈటలే నా రాజకీయ గురువు.. ఆయన వెంటే నా ప్రయాణం
- పరకాలతోనే నా బంధం
- బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్‌రావు
- తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్

బీసీలు, ఎస్సీలు, ఎస్టీ సామాజిక వర్గాలు ఉన్నతంగా ఎదగాలంటే విద్య తప్ప మరో మార్గం లేదని, ముందుగా సామాజికంగా జ్ఞానోదయం రావాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్‌రావు అన్నారు. హక్కుల కోసం బీసీలు ఉద్యమించాలని, అదే సమయంలో అగ్రవర్ణాలను దూరం చేయకుండా తమ సమస్యలను వివరించి వారిని కూడా భాగస్వాములను చేసుకుంటేనే సామాజిక మార్పు సాధ్యమవుతుందని చెప్పారు. తనకు విద్య వృత్తి ద్వారానే చాలా గుర్తింపు లభించింది అని, ఇప్పుడు ప్రజా సేవ చేసే అవకాశం వస్తే సంతోషిస్తాను అని అన్నారు. డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో తన బాల్యం, చదువు, వైద్య ప్రస్థానం, ఎంబీబీఎస్‌లో ఎదురైన కుల వివక్ష, వైద్య రంగంలో వచ్చిన మార్పులు, గార్డియన్ ఆస్పత్రి నిర్మాణం, ఐఎంఏలో తన ప్రయాణం, బీసీ సామాజిక చైతన్యం, రాజకీయ రంగ ప్రవేశం, ఈటల రాజేందర్ తో తన అనుబంధం, పరకాల నియోజక వర్గంతో తనకు ఉన్న బంధం తదితర అంశాలను ఆయన పంచుకున్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వైద్యుడిగా ఎదిగి, వైద్య సంస్థను నిర్మించి, ఇప్పుడు రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేయాలని సాగుతున్న ఆయన ప్రయాణం ఆసక్తికరంగా సాగింది.

-అక్షరశక్తి, ప్రధాన ప్రతినిధి



వివక్షే కసిగా మారింది

ఎంబీబీఎస్‌లో కుల ఆధారిత గ్రూపులు, పరస్పరం సహకరించుకోవడం, కలిసి పార్టీలు చేసుకోవడం వంటి అంశాలను గమనించడానికి తనకు ఏడాదికి పైగా సమయం పట్టిందని కాళీ ప్రసాద్‌రావు తెలిపారు. బీసీల పట్ల కనిపించిన నిర్లక్ష్యం, తాను ఎదుర్కొన్న వివక్ష తనను బాధపెట్టినా అదే తనలో మరింత కసిని పెంచిందన్నారు. ఆ కసిని చదువు, పని, ఎదుగుదల వైపు మళ్లించానని చెప్పారు. తన జీవితంలో ఎదురైన ఆ అనుభవాలే తర్వాత మరింత పెద్ద స్థాయికి ఎదగాలనే పట్టుదలను పెంచాయని వివరించారు.

యాకయ్య.. మిత్రుడే కాదు.. నా ఆత్మ

తన జీవితంలో మిత్రుడు రాజబోయిన యాకయ్య పాత్ర ఎంతో కీలకమని కాళీ ప్రసాద్‌రావు తెలిపారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన యాకయ్య తనకు మిత్రుడే కాకుండా ఆత్మలాంటి వ్యక్తి అని అన్నారు. తాను, యాకయ్య కలిసి కష్టపడ్డామని, ప్రతి దశలో ఆయన తనకు అండగా నిలిచారని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బీసీలు



మెడికల్ కాలేజీ చైర్మన్లుగా ఉన్న కాలేజీ ఆర్వీఎం అని పేర్కొంటూ, యాకయ్య తనకు దొరకడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. డాక్టర్ వృత్తిలోనూ ఎంతో కష్టపడ్డానని కాళీ ప్రసాద్‌రావు తెలిపారు. జయ, రోహిణి ప్రాంతాల్లో పనిచేసినట్లు చెప్పారు. ప్రతిరోజూ ఒక మండలానికి వెళ్లి వైద్యం అందించేవాడినన్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు పనిచేసిన రోజులు ఎన్నో ఉన్నాయన్నారు. 10 సంవత్సరాలపాటు నిరంతరం కష్టపడ్డానని చెప్పారు. చివరి దశలో ఉన్న ఎంతోమంది రోగులను కాపాడినట్లు తెలిపారు. ప్రాణాలు నిలబెట్టినప్పుడు కలిగే అనుభూతి వేరుగా ఉంటుందని అన్నారు. రఘురామ్, సత్యమూర్తి సార్‌లంటే తనకు ఎంతో గౌరవమని, వారు తనకు విలువలు నేర్పారని చెప్పారు.

'నాడి పట్టుకునే డాక్టర్ కరువయ్యాడు'

ప్రస్తుత వైద్య వ్యవస్థపై కాళీ ప్రసాద్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్లు రోగులకు దూరమయ్యారని, మిషన్లు, డబ్బులు దగ్గర య్యాయని అన్నారు. గతంలో డాక్టర్ రోగి నాడి పట్టి, వివరాలు అడిగి, సమస్యను అర్థం చేసుకుని వ్యాధిపై ఒక అంచనాకు వచ్చి చికిత్స చేసేవాడని చెప్పారు. ఇప్పుడు పరీక్షలు, మిషన్లపై ఆధారపడే పరిస్థితి పెరిగిందన్నారు. పరీక్షలు చేయకపోతే రోగులే ఆందోళన చెందుతున్నారని చెప్పారు. వైద్యం ఖర్చు పెరుగుతోందని, భవిష్యత్‌లో వైద్య వ్యవస్థ మరింత దిగజారే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు.

నవ్వుకున్న చోటే.. గార్డియన్ ఆస్పత్రి

2008లో గార్డియన్ ఆస్పత్రికి శంకుస్థాపన చేసినప్పుడు చాలామంది తనను చూసి నవ్వుకున్నారని కాళీ ప్రసాద్‌రావు తెలిపారు. ములుగు రోడ్డులో ఆస్పత్రి నిర్మాణం ప్రారంభించినప్పుడు 'ఇక్కడ ఏం డెవలప్‌మెంట్ ఉంటుంది' అని పలువురు నిరుత్సాహపరిచారని చెప్పారు. అయితే తన విజన్‌పై నమ్మకంతో ఆస్పత్రి నిర్మించానన్నారు. 2010లో ఉద్యోగానికి రాజీనామా చేసి గార్డియన్ ఆస్పత్రిని ప్రారంభించానని తెలిపారు. రోగులకు 24/7 అందుబాటులో ఉండాలనే ఆలోచనతో ఆస్పత్రి పై అంతస్తులోనే ఇల్లు ఏర్పాటు చేసుకున్నానన్నారు. ఉద్యోగ ప్రస్థానం నుంచి ఇప్పటి వరకు ప్రతిరోజూ రాత్రి 11 గంటల వరకు పేషెంట్లను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటానన్నారు.

'పేదోళ్లకు న్యాయం జరగాలే'

తాను ఆర్ఎంపీలు, పీఆర్ఓలను నమ్ముకోనని కాళీ ప్రసాద్‌రావు తెలిపారు. ప్రజలతో సత్సంబంధాలు, ప్రజాప్రతినిధులతో మంచి అనుబంధం కొనసాగిస్తానన్నారు. ఎమ్మెల్యేలు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ అధ్యక్షులు తమ గ్రామస్తులను ఆస్పత్రికి పంపిస్తారని చెప్పారు. బిల్లుల్లోనూ పేదలకు వీలైనంత వెసులుబాటు కల్పిస్తానన్నారు. పేదలకు న్యాయం జరగాలన్నదే తన సిద్ధాంతమని స్పష్టం చేశారు. ట్రామా సర్జరీల్లో తెలంగాణలో తనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.

వైద్యంతో గౌరవం.. ఐఎంఏలో మరో అడుగు

1997లో ఐఎంఏ సభ్యత్వం తీసుకున్నానని కాళీ ప్రసాద్‌రావు తెలిపారు. ఐఎంఏ సమావేశం ఏది జరిగినా హాజరయ్యేవాడినన్నారు. 2023లో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశానని చెప్పారు. ఐఎంఏలో బీసీలు అధ్యక్షులుగా ఎదగడానికి గతంలో అనేక ఇబ్బందులు ఉండేవని, అలాంటి పరిస్థితిని సులభతరం చేసేందుకు తన వంతు కృషి చేశానన్నారు. వైద్య వృత్తి ద్వారా ఎంతో గౌరవం సంపాదించుకున్నానని చెప్పారు.

ఇద్దరు బిడ్డలూ డాక్టర్లే

తన ఇద్దరు కుమార్తెలూ వైద్య రంగంలోనే ఉన్నారని కాళీ ప్రసాద్‌రావు తెలిపారు. పెద్ద కుమార్తె తేజస్వీ ఎంఎస్ ఆప్తల్మాలజీ పూర్తి చేశారని, అల్లుడు అనురాగ్ ఆర్థోపెడిక్ వైద్యుడని చెప్పారు. చిన్న కుమార్తె యశస్వి ఎండీ జనరల్ పూర్తి చేసిందన్నారు. రానున్న రోజుల్లో ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేసి వారికే అప్పగించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ అంటే తనకు ఎంతో ఇష్టమని, ఆయన రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి రాజకీయాలపై ఆసక్తి పెరిగిందని కాళీ ప్రసాద్‌రావు చెప్పారు. 1983లో ఎన్టీఆర్ పరకాలకు వస్తున్నారని తెలిసి స్నేహితులతో కలిసి రేపాక నుంచి సైకిళ్లపై పరకాలకు వచ్చామని గుర్తుచేసుకున్నారు. ఒక్కో సైకిల్‌పై ముగ్గురు వచ్చేవారమన్నారు. టీడీపీ నాయకులతో తిరిగేవాడినని తెలిపారు. అయితే తన తాత కాంగ్రెస్ అభిమాని కావడంతో తనను మందలించేవారని చెప్పారు. 2004 నుంచి 2014 వరకు మున్నూరుకాపు సంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేశానన్నారు.

ఈటల తోనే నా ప్రయాణం...

రాజబోయిన యాకయ్య ద్వారానే ఈటల రాజేందర్‌తో పరిచయం ఏర్పడిందని కాళీ ప్రసాద్‌రావు తెలిపారు. ఈటల సహకారంతోనే మెడికల్ కాలేజీ ప్రారంభించాననీ, తనకు రాజకీయ గురువు ఈటల రాజేందర్ అని స్పష్టం చేశారు. ఎప్పటికైనా ఆయన వెంట తన నడక ఉంటుందని చెప్పారు. పరకాల టికెట్ రావడం వెనుక ఈటల పాత్ర చాలా ఉందన్నారు. తాను టికెట్ కోసం ఈటలను ఎప్పుడూ ఒత్తిడి చేయలేదని చెప్పారు. తాను అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తే ఈటల కూడా పోటీ చేస్తారని ఒక కార్యక్రమంలో చెప్పిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు.

పరకాలతోనే నేను

ఈటల రాజేందర్ ప్రోత్సాహంతోనే పరకాల నియోజకవర్గంలో పనిచేస్తున్నానని కాళీ ప్రసాద్‌రావు తెలిపారు. పరకాల ప్రజల కోసం పని చేస్తున్నానన్నారు. గత ఎన్నికల్లో చాలామంది ఓటర్లు తనపై నమ్మకంతో ఓటు వేశారని చెప్పారు. ఎన్నికల్లో ఓడిపోయినందుకు బాధపడలేదన్నారు. అయితే బీసీలు అధికంగా ఉన్న ప్రాంతంలో బీసీ బిడ్డగా తనను కాదని ఇతర వర్గాలకు చెందిన వారిని ఆదరించడం బాధ కలిగించిందన్నారు. అయినా నియోజకవర్గాన్ని విడిచిపెట్టలేదని, ఫలితం వచ్చిన మరుసటి రోజు నుంచే ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నానన్నారు.

చిన్నప్పటి నుంచే రాజకీయాలపై ఆసక్తి ఉందని కాళీ ప్రసాద్‌రావు చెప్పారు. అందుకేనేమో తన బుర్రలో ఎప్పుడూ 'పాలిటిక్స్.. పాలిటిక్స్' తిరుగుతుంటుందని నవ్వుతూ అన్నారు. 2004లో 50 మంది డాక్టర్లతో కలిసి వినోద్‌కుమార్ సహకారంతో కేసీఆర్‌ను కలిసి హన్మకొండ టికెట్ అడిగినట్లు తెలిపారు. అయితే పొత్తులో ఆ సీటు బీజేపీకి వెళ్లడంతో అవకాశం దక్కలేదన్నారు. 2005లో కార్పొరేషన్ మేయర్ అవకాశం కూడా వచ్చినట్లు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి కూడా ఆఫర్ వచ్చిందని, పరకాలలో బీసీగా తనను బరిలోదింపేందుకు ప్రయత్నాలు జరిగాయని చెప్పారు. అయితే తన రాజకీయ ప్రయాణం ఈటలతోనే అని స్పష్టం చేసినట్లు తెలిపారు.

రాజకీయాలను కోర్సులా చదువుతున్నా


రాజకీయాలను కూడా ఒక కోర్సులా చదువుతున్నానని కాళీ ప్రసాద్‌రావు చెప్పారు. కసితో ముందుకు సాగుతున్నానన్నారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా తనవంతు సహాయం చేస్తున్నానన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తన ఆస్పత్రికి వచ్చే వారికి బిల్లుల్లోనూ వెసులుబాటు కల్పిస్తున్నానన్నారు. రాజకీయాల్లోకి డబ్బు కోసం రాలేదని, డబ్బే కావాలంటే వైద్య రంగంలోనే సంపాదించుకునే అవకాశం తనకు ఉందన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తారనే నమ్మకం తనకు వచ్చిందన్నారు.

'చదువుకున్నవాళ్లు రాజకీయాల్లోకి రావాలి'

ప్రస్తుతం రాజకీయాల్లో డబ్బు పెట్టాలి.. సంపాదించుకోవాలనే ధోరణి ఉందని కాళీ ప్రసాద్‌రావు అన్నారు. ఆ ధోరణి మారాలని ఆకాంక్షించారు. రాజకీయాల్లోకి చదువుకున్న వారు రావాలని, రాజకీయాలను బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. రాజకీయాల్లో బాస్ ఉండాలని, లేకపోతే రాజకీయాలు చేయకూడదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజల కోసం పనిచేసే నాయకత్వం అవసరమన్నారు.

డీలిమిటేషన్ ఇప్పట్లో కాదు...

డీలిమిటేషన్ పై వస్తున్న ప్రచారం అంతా ప్రచా



విద్యతోనే వెనుకబడిన వర్గాల ఎదుగుదల

బీసీలతోపాటు ఎస్సీ, ఎస్టీలు ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్యే ప్రధాన ఆయుధమని కాళీ ప్రసాద్‌రావు స్పష్టం చేశారు. కేవలం హక్కుల కోసం నినదించడం కాకుండా వాటిని సాధించేందుకు సామాజికంగా చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలు ఉద్యమించాలని, తమ హక్కుల కోసం పోరాడాలని చెప్పారు. అయితే ఈ పోరాటం ఇతరులను దూరం చేసే విధంగా ఉండకూడదని, అగ్రవర్ణాలను కూడా తమ ఉద్యమం గురించి వివరించి కలుపుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. సమాజంలో మార్పు రావాలంటే విద్య, చైతన్యం, ఐక్యత అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

'నన్ను డాక్టర్ చేయాలనేది నాన్న కోరిక'

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రేపాక తన స్వగ్రామమని కాళీ ప్రసాద్‌రావు తెలిపారు. తల్లిదండ్రులు పగడాల వెంకటనర్సయ్య, వజ్రమ్మ అని చెప్పారు. తమ్ముడు, చెల్లి ఉన్నారని తెలిపారు. తండ్రి టీచర్‌గా పనిచేయడంతో ఉద్యోగరీత్యా బదిలీ అయిన ప్రతిచోటికీ కుటుంబం వెళ్లాల్సి వచ్చేదన్నారు. టెన్త్ వరకు గ్రామాల్లోనే చదివానని, పదో తరగతి చిట్యాలలో పూర్తి చేశానని, ఇంటర్ పరకాలలో చదివానని చెప్పారు. చిన్ననాటి నుంచి చదువుపైనే ఎక్కువ దృష్టి ఉండేదన్నారు. తన తండ్రికి తనను డాక్టర్ చేయాలనే కోరిక బలంగా ఉండేదని కాళీ ప్రసాద్‌రావు తెలిపారు. అందుకే తన చదువు విషయంలో తండ్రి చాలా కలినంగా ఉండేవారని చెప్పారు. తోటిపిల్లలంతా ఆటలకు వెళ్లినా తాను మాత్రం పుస్తకం ముందేసుకుని కూర్చోవాల్సి వచ్చేదన్నారు. తండ్రి ఎప్పుడైనా ఊరికి వెళ్తే ఆటకు వెళ్లేందుకు అవకాశం దొరికిందని, అప్పుడు తల్లిని బతిమిలాడుకుని బయటకు వెళ్లేవాడినని చిన్ననాటి జ్ఞాపకాలను నవ్వుతూ గుర్తుచేసుకున్నారు. చిన్నతనంలోనే చదువుపై ఏర్పడిన ఆ అలవాటు తర్వాత తన జీవితాన్ని మలిచిందన్నారు.

దొర కుటుంబాలను చూసి.. చదువుపై ఆసక్తి

తనలో చదువుపై ఆసక్తి పెరగడానికి గ్రామంలోని ఉన్నత కుటుంబాలను చూడటం కూడా ఒక కారణమైందని కాళీ ప్రసాద్‌రావు చెప్పారు. రిటైర్డ్ జడ్జి రఘునందన్‌రావు గ్రామానికి వచ్చినప్పుడు ఆయనను, ఆయన పిల్లలను చూసేందుకు గ్రామస్థులు వెళ్లేవారని తెలిపారు. వారి డ్రెస్సింగ్, ఇంగ్లిష్ మాట్లాడే విధానం తనను ఆకట్టుకునేవన్నారు. తాను కూడా బాగా చదువుకుంటే అలాంటి స్థాయికి ఎదగవచ్చనే ఆలోచన అప్పుడే తనలో కలిగిందన్నారు. ఆ తర్వాత చదువుపై మరింత ఆసక్తి పెంచుకున్నానని చెప్పారు.



'వాళ్ల తాత మంత్రి అవుతడు'

తన తాత బుచ్చిరామయ్య సర్పంచ్‌గా పనిచేశారని, తనను ఎంతో ప్రత్యేకంగా చూసుకునేవారని కాళీ ప్రసాద్‌రావు తెలిపారు. మనవళ్లందరిలో తనపై తాతకు ప్రత్యేకమైన అభిమానం ఉండేదన్నారు. తన కూతురు కొడుకు కూడా తన తాతే పేరు పెట్టడానికి కూడా ఆ అనుబంధమే కారణమన్నారు. ఎంసెట్‌ను రెండుసార్లు రాసి మూడో ప్రయత్నంలో మెడికల్ సీటు సాధించానని తెలిపారు. కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, పీజీ పూర్తి చేశానన్నారు. చదువు పూర్తయ్యాక తొలుత 2 సంవత్సరాలు ఏటూరునాగారంలో పనిచేశానని, అనంతరం 12 సంవత్సరాలపాటు ఎంజీఎంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశానన్నారు. 1992లో వివాహం జరిగిందని, తన భార్య స్వర్ణలత ఎంబీబీఎస్, డీజీఓ వైద్యురాలని చెప్పారు. తన వ్యక్తిత్వం, తండ్రి టీచర్ కావడం వంటి విషయాలను చూసి తన మామ ఆకుల ఆనందం తనను వెతికి మరీ వివాహం చేశారని నవ్వుతూ తెలిపారు.

ఎంబీబీఎస్‌లోనే కుల వివక్ష అనుభవం

ఇంటర్ వరకు కులం గురించి తనకు పెద్దగా తెలియదని, ఎంబీబీఎస్‌లో చేరిన తర్వాతే కుల వివక్షను ప్రత్యక్షంగా అనుభవించానని కాళీ ప్రసాద్‌రావు తెలిపారు. ఇంటర్‌లో నలుగురు స్నేహితులతో కలిసి ఒక గదిలో ఉండేవాళ్లమని, అప్పుడు ఎలాంటి సామాజిక భేదాల గురించి ఆలోచన రాలేదన్నారు. మెడికల్ కాలేజీలో చేరిన తర్వాత కొందరికి నమస్కారం పెట్టినా స్పందించకపోవడంతో కారణమేంటో అర్థం కాక చాలా కాలం ఆలోచించానన్నారు. మొదట తన డ్రెస్సింగ్ వల్ల కావచ్చని భావించానని, తన వద్ద 2 జతల బట్టలు మాత్రమే ఉండేవని చెప్పారు.